ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

అల్లూరి సీతారామరాజు

జిల్లా వార్తలు

మంగళవారం 10 సెప్టెంబరు 2024



నేడు కూడా విద్యా సంస్థలకు సెలవు

పాడేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో మంగళవారం కూడా అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. భారీ వర్షాలతో గెడ్డలు, వాగులు పొంగుతుండడంతోపాటు వర్షాల వల్ల పాఠశాలల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో సోమవారం సెలవు ప్రకటించిన విషయం తెలిసిందే. వర్షాలు కొనసాగుతుండడంతో మంగళవారం కూడా సెలవు ప్రకటించారు.



నర్సీపట్నం-చింతపల్లి ప్రధాన రహదారి మడిగుంట వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వే



జోలాపుట్టులో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు వంతెన మునిగిపోయిన దృశ్యం

జల ప్రళయం

వాయుగుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

- వరద నీటితో పోటెత్తిన జలాశయాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- మారుమూల ప్రాంతాలకు నిలిచిపోయిన రాకపోకలు
- జీకేవీధి మండలం చట్రాపల్లిలో కొండచరియలు విరిగి పడి మహిళ మృతి
- ఘాట్ మార్గాల్లో రాకపోకలపై కొనసాగుతున్న నిషేధం

పాడేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):

బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఆదివారం నుంచి భారీగా వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో గెడ్డలు, వాగుల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో అవి ఉగ్రరూపం దాల్చాయి. ఎక్కడికక్కడ కల్వర్టులు, రోడ్లు ధ్వంసమయ్యాయి. జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ పరిధి చట్రాపల్లి గ్రామంపై కొండ చరియలు విరిగిపడిన ఘటనలో కొర్రా కుమారి(20) అనే గిరిజన యువతి మృతి చెందింది.

జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ వర్షాలు కురుస్తుండడంతో కొండల్లోని ఊటలు పెరిగి వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఒడిశా రాష్ట్రానికి సరిహద్దులో ఉండడంతో ముంచంగిపుట్టు, పెదబయలు, చింతపల్లి మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. సోమవారం కంటే ఆదివారం రోజంతా భారీ వర్షాలు కురవడంతోనే వరద నీటి ఉధృతి పెరిగింది.



భారీ వర్షాలకు కొట్టుకుపోయిన చింతపల్లి మండలంలోని తడ్డపల్లి వంతెన

పాడేరు, లంబసింగి, గాలికొండ ఘాట్‌మార్గాల్లో బండరాళ్లు, చెట్లు విరిగిపడ్డాయి. జిల్లాలో అన్ని ఘాట్ మార్గాల్లో రాకపోకల నిషేధాన్ని కొనసాగించాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్, పాడేరు ఐటీడీఏ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి మండలాల్లోని గెడ్డల అవతల ఉన్న గ్రామాల గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు గెడ్డలు, వాగులు దాటవద్దని అధికారులు సూచిస్తున్నారు. తాజా వర్షాలకు జన జీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు సగటు 81.53 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, సోమవారం ఉదయం 8.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు 14.45 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



సీలేరు ధారకొండ ప్రధాన రహదారిలో కొండల పైనుంచి నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిన చెట్లు

కొట్టుకుపోయిన కాజ్‌వే

చింతపల్లి: నర్సీపట్నం- చింతపల్లి ప్రధాన రహదారి మడిగుంట బ్రిడ్జి వద్ద నిర్మించిన ప్రత్యామ్నాయ మార్గం(కాజ్ వే) కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మడిగుంట వద్ద వరద ఉధృతి భారీగా పెరిగిపోయింది. వరద ప్రవాహానికి కాజ్ వే పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాల మేరకు జాతీయ రహదారుల అధికారులు యుద్ధప్రాతిపదికన మడిగుంట వద్ద తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. మంగళవారం ఉదయం నుంచి తాత్కాలిక వంతెనపై నుంచి రాకపోకలు యథావిధిగా సాగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు.

పెంటపాడు బ్రిడ్జి వద్ద..

చింతపల్లి/గూడెంకొత్తవీధి: రింతాడ-చింతపల్లి మార్గంలోని పెంటపాడు బ్రిడ్జి వద్ద నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదివారం కురిసిన భారీ వర్షాలకు పెంటపాడు బ్రిడ్జి వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో కాజ్‌వే కొట్టుకుపోయింది. పెంటపాడు వద్ద ఉన్న పాత బ్రిడ్జి బలహీనంగా ఉండడంతో ఈ మార్గంలో కనీసం ద్విచక్ర వాహనాలు సైతం ప్రయాణించేందుకు పోలీసులు, ఎన్‌హెచ్ అధికారులు అనుమతించడం లేదు. పెంటపాడు ... మిగతా 8వ పేజీలో

గిరి శిఖర గ్రామాల పట్ల అప్రమత్తం

అధికారులకు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశం



కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్

పాడేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల నేపథ్యంలో గిరి శిఖర గ్రామాలు, కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి అధికారులతో సోమవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలకు రోడ్లు, వంతెనలు ఎక్కడ తెగిపోయాయో వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రజలు కాలినడకన, వాహనాలపైన వాగులు, గెడ్డలు దాటకుండా చైతన్యవంతం చేయాలని సూచించారు. తెగిపోయిన గెడ్డలు, వాగుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది నిరంతరం కాజ్‌వేలు, కల్వర్టుల పరిస్థితులను పరిశీలించి సమాచారం అందించాలన్నారు. పాడేరు డివిజన్‌లో తొమ్మిది చోట్ల, రంపచోడవరం డివిజన్‌లో ఏడుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పంట నష్టాలను నమోదు చేయాలని చెప్పారు. జిల్లాలో ఉన్న ఐదు ఘాట్ రోడ్లలో వాహనాల రాకపోకల నిషేధాన్ని పొడిగించాలన్నారు. నిత్యావసర సరకులు, అత్యవసర సేవల వాహనాలను మాత్రమే అనుమతించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రహదారుల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. జోలాపుట్టు జలాశయంలో ఏడు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారని, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చింతూరు డివిజన్‌లో శబరి నదికి 38 అడుగుల నీటిమట్టం పెరిగినందున ప్రభావిత గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, పునరావాసం కల్పించాలని తెలిపారు. పాడేరు డివిజన్‌లో పాడుబడి భవనాలు, మట్టి నిర్మాణాలు, కల్వర్టులు పరిశీలించి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

మృతురాలి కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడిన ఘటనలో మృతి చెందిన కొర్రా కుమారి(20) కుటుంబ సభ్యులకు జాతీయ, రాష్ట్ర విపత్తుల సంస్థ నిబంధనల మేరకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను కలెక్టర్ ప్రకటించారు. మరో ముగ్గురు వ్యక్తులు కొర్రా పండన్న(60), కొర్రా సుమిత్ర(18) కొర్రా సుబ్బారావు (25) గాయపడ్డారని, వారిని సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించి చికిత్స అందిస్తున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే. అభిషేక్‌గౌడ్, డీఆర్‌వో బి.పద్మావతి, సీపీవో ఎస్ఆర్‌కే పట్నాయక్, వివిధ ప్రాంతాల నుంచి ఎస్పీ అమిత్‌బర్దార్, ఐటీడీఏ పీవోలు కట్టా సింహాచలం, అపూర్వభరత్, సబ్ కలెక్టర్లు కల్పశ్రీ, శౌర్యమన్ పటేల్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఐటీడీఏలోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పాడేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడి భారీ వర్షాలు కురుస్తున్నందున స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఏజెన్సీ 11 మండలాల్లో ఎటువంటి సంఘటనలు జరిగినా సమాచారం వెంటనే అందించాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జె.మాధవి సెల్ నంబర్: 7780361430, ఎ.కామేశ్వరరావు సెల్ నంబర్: 8500374633, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎల్.దేవాపాత్రుడు సెల్ నంబర్: 94418 42177, బి.చైతన్య సెల్ నంబర్:9494781751, రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు వై.రవికిరణ్, ఎంఏ. జిలానీ సెల్ నంబర్: 9492784678లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు

స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్టు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు జె.తేజేశ్వరరావు, కె.మధుసూదన్ సెల్ నంబర్: 86881 58907లో అందుబాటులో ఉంటారని, అలాగే అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు 08935 251737, లేదా 6303921374 ఫోన్ నంబర్లలో సంప్రతించాలన్నారు. ఐటీడీఏ అధికారులు హేమలత సెల్ నంబర్: 9441919730, కన్యాకుమారి సెల్ నంబర్: 8688158907 లను పర్యవేక్షణాధికారులుగా నియమించామని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు.

అంతులేని విషాదం

- నాడు కోడిపుంజు వలస.. నేడు చట్రాపల్లి
- బురదతో కూడిన వరద ముంచెత్తడంతో మహిళ మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- పద్దెనిమిదేళ్ల తరువాత మళ్లీ విరుచుకు పడిన కొండచరియలు

చింతపల్లి, సెప్టెంబరు 9: గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలో బురదతో కూడిన వరద ముంచెత్తడంతో ఓ గిరిజన మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలో పలువురు ఆదివాసీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలకు వరద బీభత్సానికి కొండ చరియలు విరిగి పడ్డాయి. ఇటువంటి ఘటనే పద్దెనిమిదేళ్ల క్రితం అరకులోయ మండలం శిరగాం పంచాయతీ కోడిపుంజు వలస గ్రామంలో జరిగింది. 2006 ఆగస్టు 3వ తేదీ రాత్రి కొండచరియలు, బురదతో కూడిన వరద కారణంగా 19 మంది సజీవ సమాధి అయ్యారు. అధిక సంఖ్యలో ఆదివాసీలు గాయపడ్డారు. మరోసారి చట్రాపల్లి గ్రామంలో కొండ చరియలు విరిగి పడడంతో ఆదివాసీలు ఉలిక్కిపడ్డారు. పాడేరు డివిజన్ పరిధిలో అటవీ విస్తీర్ణం ... మిగతా 8వ పేజీలో



చట్రాపల్లిలో నేలమట్టమైన పండన్న ఇల్లు



చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడడంతో కొట్టుకు వచ్చిన రాళ్లు, బురద

భర్తపై అలిగి పుట్టింటికి వచ్చి అనంతలోకాలకు..

చట్రాపల్లి గ్రామంలో విషాదం


గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 9: భర్తపై అలిగి పుట్టింటికి వచ్చిన ఓ ఆదివాసీ మహిళ కొండచరియలు విరిగిపడడంతో మృతి చెందడం చట్రాపల్లి గ్రామంలో విషాదాన్ని నింపింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామానికి చెందిన పండన్న పెద్ద కుమార్తె కొర్ర కుమారి(20)కి రెండేళ్ల క్రితం చింతపల్లి మండలం లోతుగెడ్డ పంచాయతీ దోమలగొంది గ్రామానికి చెందిన రాజుతో వివాహమైంది. భర్త తరచూ తాగి ఇంటి వస్తుండడంతో గొడవలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో కుమారి భర్తపై అలిగి పుట్టినిల్లు చట్రాపల్లికి వచ్చేసింది. వారం రోజులుగా కుటుం సభ్యులతో ఉంటోంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు కావడంతో తండ్రితో పొలం పనులు చేస్తున్నది. ఆదివారం రాత్రి ఆమె వంట చేసి కుటుంబ సభ్యులందరికి భోజనం పెట్టింది. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి ఒకే గదిలో నిద్రించింది. ఊహించని విధంగా కొండచరియలు పండన్న ఇంటిపై విరుచుకుపడడంతో నిద్రలోనే వరదలో కొట్టుకుపోయి ఆమె మృతి చెందింది.

జలాశయాలకు పోటెత్తిన వరద నీరు

సీలేరు జల విద్యుత్ కేంద్రంలోకి నీరు

- గుంటవాడ జలాశయం నుంచి 25 వేల క్యూసెక్కులు, డొంకరాయి జలాశయం నుంచి లక్షా 10 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల

సీలేరు, సెప్టెంబరు 9: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు సీలేరు కాంప్లెక్సులోని జలాశయాలకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై డొంకరాయి, గుంటవాడ జలాశయాల నుంచి దిగువకు నీరును విడుదల చేస్తున్నారు. డొంకరాయి పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 1,037 అడుగులు కాగా, వలసగెడ్డ, పాలగెడ్డ, మంగంపాడు వాగుల నుంచి లక్షా పది వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చి చేరుతున్నది. నీటిమట్టాన్ని స్థిరంగా కొనసాగించేందుకు అధికారులు జలాశయం ఏడు ... మిగతా 8వ పేజీలో



ముంచంగిపుట్టు మండల పరిధిలోని జోలాపుట్టు స్పిల్‌వే డ్యామ్ నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం



సీలేరు జల విద్యుత్ కేంద్రం డీ వాటరింగ్ పంప్ షెడ్డు నీట మునిగిన దృశ్యం

సీలేరు కాంప్లెక్సులోని జలాశయాల పూర్తి స్థాయి నీటిమట్టాలు, ప్రస్తుతం నీటి మట్టాల వివరాలు

జలాశయం పేరు	పూర్తి స్థాయి నీటిమట్టం (అడుగుల్లో)	ప్రస్తుతం నీటిమట్టం (అడుగుల్లో)
జోలాపుట్టు	2,750	2,749.50
బలిమెల	1,516	1,510.00
గుంటవాడ	1,360	1,359.00
డొంకరాయి	1,037	1,036.50

అతలాకుతలం

వాయుగుండంతో కురిసిన వర్షాలు ఉమ్మడి విశాఖ జిల్లాను అతలాకుతలం చేశాయి. నదులు, వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పంటలను ముంచెత్తాయి. పలు నదులు, వాగులు కోతకు గురయ్యాయి. రోడ్లపై వరద నీరు ప్రవహించింది. రోడ్లకడ్డంగా చెట్లు పడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


బుచ్చెయ్యపేట: వడ్డాది కస్పా గ్రోయిన్‌పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు


చోడవరం: చాకిపల్లి వద్ద వరద ముంపులో వరి పొలాలు, చెరకు తోటలు


నర్సీపట్నంలో వరాహ నది చెక్‌డ్యామ్ మీద నుంచి ప్రవహిస్తున్న వరద నీరు



అనంతగిరి: బొర్రా గుహలు మూసివేతతో వేచి ఉన్న పర్యాటకులు


రాంబిల్లి మండలం రాజుకోడూరు వద్ద ముంపునకు గురైన వరి పొలాలు


ఎస్.రాయవరం: సోముదేవుపల్లి వద్ద వరాహ నది ఉధృతితో కోతకు గురవుతున్న గట్టు


నాతవరం: గన్నవరం మెట్ట వద్ద తుని-నర్సీపట్నం రోడ్డుపై ప్రవహిస్తున్న ఎర్రిగెడ్డ

జల దిగ్బంధంలో పూడిమడక

- ఆందోళనకు గురైన మత్స్యకారులు
- సాయంత్రానికి శాంతించిన ఉప్పుటేరు

అచ్యుతాపురం, సెప్టెంబరు 9: మండలంలోని తీర ప్రాంత గ్రామమైన పూడిమడక జల దిగ్బంధంలో చిక్కుకుంది. సోమవారం ఉదయం ఉప్పుటేరు పొంగడంతో పూడిమడక గ్రామం చుట్టూ నీరు చేరింది. దీంతో మత్స్యకారులు ఆందోళన చెందారు. జాలారిపాలెం దాటిన తర్వాత పొగిరి వద్ద ప్రారంభమైన ఉప్పుటేరు పూడిమడక శివారు కడపాలెం వద్ద మళ్లీ సముద్రంలో కలుస్తుంది. సోమవారం పోటు సమయంతో భారీగా ఉప్పుటేరు పొంగి పూడిమడక చుట్టూ నీరు చేరి సముద్రంలా తయారైంది. రాత్రికి కూడా ఇదే పరిస్థితి కొనసాగితే కడపాలెం శివారు సముద్రం వద్ద గండి కొట్టాలని మత్స్యకారులు భావించారు. లేకుంటే కడపాలెం మునిగి పోతుంది. గతంలో చాలా సార్లు ఇదే విధంగా చేసి మత్స్యకారులు తమ గ్రామాన్ని కాపాడుకున్నారు. అయితే సోమవారం సాయంత్రం నుంచి వర్షం తగ్గడంతో ఉప్పుటేరు శాంతించింది. దీంతో మత్స్యకారులు ఊపిరి పీల్చుకున్నారు.


ఉప్పుటేరు పొంగడంతో పూడిమడక చుట్టూ చేరిన నీరు

ఆక్రమణలు తొలగింపు

పూడిమడక తీరంలో ఆక్రమణలను సోమవారం అధికారులు ఎక్సకవేటర్‌తో తొలగించారు. కడపాలెంలో సముద్రానికి అతి తక్కువ దూరంలో కొందరు మత్స్యకారులు పాకలు, పశువుల శాలలు వేసి ఆక్రమణలకు పాల్పడ్డారు. వాయుగుండం కారణంగా సముద్రం పాకలు వరకు వచ్చింది. దీంతో అధికారులు సోమవారం ఎక్సకవేటర్‌తో వీటిని తొలగించారు.

చోడపల్లి వద్ద కూలిన భారీ వృక్షం

ఐదు గంటలు ట్రాఫిక్ జామ్

అచ్యుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారిలో చోడపల్లి వద్ద భారీ మర్రి వృక్షం సోమవారం రోడ్డుకడ్డంగా పడిపోయింది. దీంతో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 11 గంటల సమయంలో భారీ వృక్షం పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందిన వెంటనే పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ నమ్మి గణేష్, ఎస్ఐ వెంకటరావు చెట్టు పడిపోయిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. భారీ వాహనాలను సాదుపాకలు జంక్షన్, కొండకర్ల, బంగారయ్యపాలెం, మడుతూరు జంక్షన్ మీదుగా అచ్యుతాపురానికి మళ్లించారు. చిన్న వాహనాలను పక్కనే గల లేఅవుట్ నుంచి మళ్లించారు.

విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తక్షణం స్పందించి నలుగురు కట్టర్‌లు, నాలుగు ఎక్సకవేటర్లు ఏర్పాటుచేశారు. సాయంత్రం నాలుగున్నర గంటలకు చెట్టుని తొలగించి ట్రాఫిక్‌ని పునరుద్ధరించారు.


కూలిన భారీ వృక్షాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐలు

అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

ఎస్పీ ఎం.దీపిక

అనకాపల్లి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌లకు ప్రజల నుంచి అందుతున్న వినతులను చట్టపరిధిలో తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా 10 మంది ఫిర్యాదుదారులతో ఆమె విడివిడిగా మాట్లాడి పరిష్కార మార్గాలు చూపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసు స్టేషన్‌లకు అందుతున్న ఫిర్యాదులను చట్టపరిధిలో నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలని ఆదేశించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

'11న దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలి'


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 9 : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 11వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే బంద్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ హర్ష కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక గాంధీనగరం కల్యాణ మండపంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జేఏసీ కన్వీనర్ మర్రా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు కూడా వర్గీకరణ తీర్పుపై పునః సమీక్ష చేయాలని కోరారు. నవంబరు నెలలో మాలల సింహగర్జన ఏర్పాటు చేసి మాలల సత్తా ఏమిటో నిరూపిద్దామన్నారు. రాష్ట్ర దళితసేన అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు మాట్లాడుతూ ఇప్పటికైనా అందరం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు వ్యవస్థాపకులు కేబీ ఆర్ అంబేడ్కర్, ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, దాసరి చెన్నకేశవులు, రాజేంద్ర ప్రసాద్, పల్లా బాబ్జి, బాలకృష్ణ, దయాల్‌రాజ్, గోడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాగారాల గెడ్డకు గండి

మాకవరపాలెం, సెప్టెంబరు 9: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జి.కోడూరు జాగారాల గెడ్డకు పడిన గండిని మండల ప్రత్యేకాధికారి కె.మనోరమ సోమవారం పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎటువంటి పనులు చేపట్టకపోవడంతో భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా ఈ గెడ్డకు గండి పడడం, వరి పంట నష్టపోవడం జరుగుతుందని రైతులు ఆమెకు వివరించారు. గెడ్డకు సిమెంటు వాల్ నిర్మాణం చేపట్టాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి మాట్లాడుతూ జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని, అలాగే గెడ్డకు సిమెంట్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో సీతా మహాలక్ష్మి, ఏవో చిరంజీవి ఉన్నారు.


గండిని పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మనోరమ, అధికారులు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాకవరపాలెం, సెప్టెంబరు 9: మండలంలో ప్రమాదవశాత్తూ ఒకరు మృతి చెందినట్టు ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలో రామన్నపాలెం గ్రామానికి చెందిన కర్రి రాము(45) సోమవారం ఉదయం ఇంటి నుంచి బైకుపై జగనన్న కాలనీకి వెళుతుండగా బ్రేక్ వేయడంతో కిందకు పడిపోయాడన్నారు. ఆ సమయంలో రాము తలకు బలమైన గాయం తగలడంతో స్థానికులు నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మాడుగులకు బస్సులు రద్దు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 9: భారీ వర్షాల కారణంగా విజయరామరాజుపేట-వడ్డాది మధ్య తాచేరు గెడ్డపై తాత్కాలికంగా వేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో మాడుగులకు బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారు. అలాగే సోమవారం ఖండివరం-మాడుగుల మధ్యలో పంట కాలువపై వేసిన కల్వర్టు, రోడ్డు కోతకు గురై భారీ గండి పడింది. దీంతో అటుగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ బస్సులు రద్దు చేశారు. అప్పలరాజుపురం నుంచి కొత్త బోయపాడు మీదుగా మాడుగులకు రోడ్డు సదుపాయం ఉన్నప్పటికీ వర్షాలు దృష్ట్యా ఆటంకాలు ఎదురవుతాయని ఆర్టీసీ బస్సులు ఈ రూట్లో తిప్పలేదు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాముడు ఎంపిక

దేవరాపల్లి, సెప్టెంబరు 9: మండలంలోని కాశీపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థి రెడ్డి రాముడు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయురాలు టీటీ. సుందరి తెలిపారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో కాకినాడ జిల్లా అన్నవరంలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని ఆమె తెలిపారు. విద్యార్థిని, ఉపాధ్యాయుడు కె.రాంబాబులను సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, వంటాకు పైడితల్లమ్మ, ఆదిరెడ్డి సింహాచలంనాయుడు తదితరులు అభినందించారు.

'పెద్దేరు'ను పరిశీలించిన కలెక్టర్


పెద్దేరు జలాశయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

మాడుగుల రూరల్, సెప్టెంబరు 9: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయాన్ని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం పరిశీలించారు. జలాశయం స్థితిగతులను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జలాశయం నీటి సామర్థ్యాన్ని లెక్కించాలని, నీరు విడిచిపెట్టేటప్పుడు దిగువ ప్రాంతాల వారికి సమాచారమిచ్చి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దారు పీవీరత్నం, జలాశయం అధికారులు సుధాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం, ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

జిల్లా అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష

నక్కపల్లి, సెప్టెంబరు 9: వాయుగుండం ప్రభావంతో కురిసిన వర్షాల అనంతరం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమయంలో గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఎస్పీ దీపికలతో కలిసి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద తీవ్రత వున్న పంచాయతీల్లో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని డీపీవో శిరీషారాణిని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఈ వర్షాలకు 3,600 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగినట్టు జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు వివరించారు. గ్రామాల్లో జ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు సూచనలు చేసి, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతిని హోం మంత్రి ఆదేశించారు. ప్రజలకు తాగునీరు ఇబ్బంది లేకుండా చూసుకోవల్సిన బాధ్యత అధికారులపై వుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో పరిస్థితిని టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, కురందాసు నూకరాజు, జానకి శ్రీను, అమలకంటి అబద్ధం, పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి బుజ్జి, వైబోయిన రమణ హోం మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమావేశంలో ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐలు కుమారస్వామి, అప్పన్న, ఎస్ఐలు సన్నిబాబు, విభీషణరావు పాల్గొన్నారు.


వరద నష్టంపై అధికారులతో సమీక్ష జరుపుతున్న హోం మంత్రి అనిత

రైతులను ఆదుకునేందుకు చర్యలు

అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ


శంకరం వద్ద వరి పొలాలను పరిశీలిస్తున్న ఎంపీ సీఎం రమేశ్


మార్టూరు వద్ద వరి పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, సెప్టెంబరు 9 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారం నీట మునిగిన పంట పొలాలను వారు వేర్వేరుగా పరిశీలించారు. శంకరం, బొజ్జన్నకొండ, దిబ్బపాలెంలో నీట మునిగిన వరి పొలాలను ఎంపీ సీఎం రమేశ్ పరిశీలించి స్థానిక రైతులు, అధికారులతో మాట్లాడారు. రైతాంగానికి ఇబ్బందులు లేకుండా యుద్ధప్రాతిపదికన పొలాల్లో నీట తరలింపునకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే కాలువల్లో పూడిక, తుప్పల తొలగింపులను చేపట్టాలని ఆదేశించారు. తుమ్మపాల, మార్టూరు ప్రాంతంలో నీట మునిగిన వరి పొలాలను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వ్యవసాయాధికారులు నిత్యం అందుబాటులో ఉంటారని, రైతుల సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వరద నివారణ చర్యలు సత్వరమే చేపట్టాలి

- కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఆదేశం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 9: వరద నివారణ చర్యలు సత్వరమే చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం భారీ వర్షాలకు బీఎన్ రోడ్డులో మునిగిన వడ్డాది కాజ్‌వే, కొట్టుకుపోయిన తాచేరు డైవర్షన్ రోడ్డులను ఆమె పరిశీలించారు. వడ్డాది కాజ్‌వే వద్ద చిక్కుకుపోయిన తుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించాలని, తాచేరు డైవర్షన్ రోడ్డుకు ఇరువైపులా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాచేరు వంతెన నిర్మాణంపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ సాయి శ్రీనివాసరావును కలెక్టర్ ప్రశ్నించారు. కాంట్రాక్టరు నిర్మాణ పనులు చేపట్టలేదని ఏఈఈ వివరించారు. కాంట్రాక్టరు, ఆర్అండ్‌బీ ఈఈ బుధవారం తన కార్యాలయంలో కలిసేలా చర్యలు చేపట్టాలని ఆర్డీఓ చిన్నికృష్ణను కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆదేశించారు. డైవర్షన్ వందలాది ఎకరాల్లో పంట నీట ముంపునకు గురైందని రైతులు కలెక్టర్‌కు వివరించారు. పొలాల్లోని ముంపునీరు పోయేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.


వరద నీట మునిగిన వడ్డాది కాజ్‌వేను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ్‌కృష్ణన్


వడ్డాది కాజ్‌వేపై ఉన్న తుప్పలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆర్‌అండ్‌బీ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

బీఎన్.రోడ్డులో బంగారుమెట్ట కూడలి వద్ద గొయ్యిలు బావులను తలపిస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ ఆర్అండ్‌బీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అనకాపల్లి నుంచి వడ్డాదికి కశింకోట-బంగారుమెట్ట(కేబీ) రోడ్డు ద్వారా చేరుకున్నారు. బంగారుమెట్ట కూడలి వద్ద భారీ గొయ్యిలను చూసి ఆమె కారు ఆపి కిందకు దిగారు. ఇంత భారీ గొయ్యిలు ఏర్పడినా మరమ్మతులు చేపట్టకపోవడాన్ని ఆమె ఆక్షేపించారు. తాను మండల పర్యటన ముగించేలోగా, మరమ్మతు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో అధికారులు హుటాహుటీన ఎక్స్‌కవేటర్‌తో బంగారుమెట్ట కూడలి వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. వడ్డాది కాజ్‌వేలో చిక్కుకున్న తుప్పలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, హెచ్‌డీటీ అరుణ్‌చంద్ర, వీఆర్వో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ ఎంవీ.బాలాజీ

పాయకరావుపేట, సెప్టెంబరు 9 : ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎంవీ.బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ అమలు, గర్భిణులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అంతరం ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలోని ముంపు ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలకు వైద్య సేవలు అందజేయాలన్నారు. అదేవిధంగా ప్రసవానికి దగ్గరగా ఉన్న గర్భిణులను పీహెచ్‌సీకి తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్, ఎంపీఈఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	85.00
లైవ్ ధర	105.00
విత్ స్కిన్	180.00
స్కిన్ లెస్	190.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

నేడు చింతపల్లి, జీకే వీధిలో మంత్రి సంధ్యారాణి పర్యటన

▸▸ వర్షాలకు నష్టపోయిన ప్రాంతాలు సందర్శన

చింతపల్లి, సెప్టెంబరు 9: గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాల్లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం పర్యటించనున్నారు. అధిక వర్షాల వల్ల రెండు మండలాల్లో భారీగా రహదారులు కొట్టుకొపోవడం, చట్రాపల్లిలో కొండచరియలు విరిగిపడడంతో మంత్రి పర్యటించనున్నారు. ఉదయం 7:30 గంటలకు విశాఖపట్నంతో బయలుదేరి 10:30 గంటలకు లంబసింగి ఏపీటీడీసీ హరితవేలి రిసార్ట్సకి చేరుకుంటారు. 30 నిమిషాల పాటు అధికారులతో అధిక వర్షాలపై జరిగిన నష్టంపై చర్చిస్తారు. 11 గంటలకు రిసార్ట్స్ నుంచి బయలుదేరి వర్షాలకు కొట్టుకుపోయిన మడిగుంట కాజ్‌వేను పరిశీలిస్తారు. అనంతరం 11:40 గంటలకు పెంటపాడు వద్ద కొట్టుకుపోయిన కాజ్‌వేను పరిశీలిస్తారు. 12:30 గంటలకు జీకే వీధి మీదుగా గూడెంపాతవీధికి చేరుకుంటారు. గ్రామంలో వరదల వల్ల నష్టపోయిన పంట పొలాలను పరిశీలిస్తారు. 12:45 గంటలకు సంపంగిగొంది గ్రామానికి చేరుకుని కొట్టుకుపోయిన రహదారిని పరిశీలిస్తారు. అక్కడే విలేకరులతో మాట్లాడుతారు. అలాగే 2:20 గంటలకు తిరిగి లంబసింగి ఏపీటీడీసీ రిసార్ట్సకి చేరుకుని భోజన విరామం తరువాత రోడ్డు మార్గంలో విశాఖపట్నం వెళతారు. అయితే మంత్రి చట్రాపల్లి వెళ్లాలని భావించినప్పటికీ సప్పర్ల-జీకే వీధి మధ్య నాలుగు చోట్ల రహదారులు కొట్టుకుపోవడం, కాలినడకన కూడా ప్రయాణించే పరిస్థితి లేకపోవడంతో ఈ పర్యటనను అధికారులు రద్దు చేశారు.

చట్రాపల్లి గ్రామస్థులకు పునరావాసం

▸▸ క్షతగాత్రులకు మెరుగైన చికిత్స: ఐటీడీఏ పీవో అభిషేక్

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 9: చట్రాపల్లి గ్రామంలో కొండచరియల వల్ల నష్టపోయిన గిరిజనులకు పునరావాసం కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ తెలిపారు. సోమవారం చట్రాపల్లి గ్రామాన్ని సందర్శనకు పీవో పయనం కాగా, పెంటపాడు వద్ద కాజ్‌వే కొట్టుకుపోవడంతో వంచుల మార్గంలో జీకే వీధి చేరుకున్నారు. ఇక్కడ నుంచి మండల స్థాయి అధికారులతో కలిసి చట్రాపల్లి గ్రామానికి బయలుదేరారు. అయితే సంగిగొంది గ్రామం వద్ద రహదారి పూర్తిగా కొట్టుకుపోవడంతో ముందుకు వెళ్లే మార్గం లేక అక్కడ నుంచి వెనుదిరిగారు. ఈ సందర్భంగా విలేకరులతో పీవో మాట్లాడుతూ చట్రాపల్లి గ్రామంలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, 120 మంది జనాభా ఉన్నారని చెప్పారు. గ్రామంలో అర్ధ రాత్రి కొండచరియలు విరిగి పడడం చాలా బాధాకరమని వాపోయారు. కొండచరియల వల్ల కుమారి మృతి చెందగా, ఆమె కుటుంబానికి జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ రూ.5 లక్షల నష్టపరిహారం ప్రకటించారన్నారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురికి సప్పర్ల పీహెచ్‌సీలో మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. క్షతగాత్రులను మైదాన ప్రాంతాలకు తరలించే పరిస్థితి లేకపోవడంతో పీహెచ్‌సీలో వైద్యులు చికిత్స అందిస్తున్నారన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఆస్తి నష్టం జరిగినా, ప్రాణ నష్టం జరగకుండగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామానికి మరో మార్గంలో సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులను పంపించామన్నారు. వర్షాల వల్ల దెబ్బతిన్న కల్వర్టులు, బ్రిడ్జిలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించినట్టు పీవో తెలిపారు. ప్రధాన మార్గాల్లో రాకపోకలు పునరుద్ధరించేందుకు మైదాన ప్రాంతాల నుంచి ఇంజనీరింగ్ అధికారులు, యంత్రాలను తీసుకొస్తామన్నారు. అనంతరం రింతాడ వద్ద వర్షానికి కొట్టుకుపోయిన కాజ్‌వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు, డీఈఈ చాణిక్యరావు, ఏఈఈ యాదకిశోర్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.


సంపంగిగొంది వద్ద కొట్టుకుపోయిన రహదారిని పరిశీలిస్తున్న పీవో అభిషేక్

నర్సీపట్నం-చింతపల్లి మార్గంలో రాకపోకలు పునరుద్ధరణకు చర్యలు

చింతపల్లి: నర్సీపట్నం-చింతపల్లి మార్గంలో రాకపోకలు పునరుద్ధరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. సోమవారం వర్షాలకు కొట్టుకుపోయిన మడిగుంట కాజ్‌వే (డైవర్షన్ రోడ్డు)ను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ మడిగుంట బ్రిడ్జి వద్ద జాతీయ రహదారుల అధికారులు తాత్కాలికంగా రోడ్డు నిర్మాణానికి పనులు చేపడుతున్నారన్నారు. రాత్రికి డైవర్షన్ పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. మంగళవారం నుంచి ఈ మార్గంలో వాహనాలు తిరగవచ్చునన్నారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కాజ్‌వే పనులు శరవేగంగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు డీవీఆర్‌ఎం రాజు, చాణిక్యరావు పాల్గొన్నారు.

జల ప్రళయం

కాజ్‌వే కొట్టుకుపోవడం వల్ల జీకేవీధి, కృష్ణాదేవిపేటకు వెళ్లేందుకు ప్రయాణికులు ప్రత్యామ్నాయంగా వంచుల, గండెంపల్లి రహదారులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం రింతాడ- చింతపల్లి మార్గం పూర్తిగా మూసుకుపోయింది. పెంటపాడు వద్ద తాత్కాలిక వంతెన నిర్మాణానికి రెండు, మూడు రోజుల సమయం పడుతుందని జాతీయ రహదారుల అధికారులు చెబుతున్నారు.

కొట్టుకుపోయిన తడ్డపల్లి వంతెన

చింతపల్లి: మండలంలో భారీ వర్షం కురిసింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. బలపం పంచాయతీ తడ్డపల్లి వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో పది గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాజంగి జలాశయం దిగువన బలభద్రం వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. పంట పొలాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. లంబసింగి ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి.

జల దిగ్బంధంలో లోతుగెడ్డ జంక్షన్

చింతపల్లి: మండలంలోని పెదబరడ పంచాయతీ లోతుగెడ్డ జంక్షన్ గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకున్నది. మూడిళ్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి లోతుగెడ్డ జంక్షన్ మీదుగా వెళుతున్నది. గ్రామంలోని ఇళ్ల కంటే ఎత్తులో జాతీయ రహదారి నిర్మాణం జరిగింది. దీంతో కొండ వాగుల నుంచి వచ్చిన నీరు బయటకు పోయే మార్గం లేక ఇళ్లను చుట్టు ముట్టింది. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి గ్రామానికి చెందిన కొటియాడ సత్తిబాబు, అనుసూరి గోపి, శ్రీకాకుళం సత్తిబాబుల ఇళ్లు నీట మునిగిపోవడంతో వారికి పాఠశాలలో పునరావాసం కల్పించేందుకు తహసీల్దార్ రామకృష్ణ, ఎంఈవో ప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

పొంగి ప్రవహిస్తున్న వాగులు

కొయ్యూరు: మండలంలోని యు.చీడిపాలెం పంచాయతీలో నీలవరం- గంగవరం మధ్య గల కొండవాగు పొంగి ప్రవహిస్తుండడంతో తీగలమెట్ట, పాలసముద్రం, గంగవరం తదితర సుమారు 10 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కాకరపాడు సమీప కొండవాగు వంతెన పైనుంచి వరద నీరు ప్రవహించడంతో పాటు శింగవరం ఐటీడీఏ కాలనీ సమీప వట్టిగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో కొయ్యూరుతో పాటు మరో ఆరు పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. రావణాపల్లి, తోటలూరు గ్రామాల్లో సుమారు 20 ఎకరాలలో వరి పంటకు నష్టం వాటిల్లింది

నీట మునిగిపోయిన సరిహద్దు వంతెన

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు సమీపంలో ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలను కలిపే సరిహద్దు వంతెన సోమవారం నీట మునిగిపోయింది. దీంతో దాని పైనుంచి రాకపోకలను ప్రస్తుతం నిలిపివేస్తున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల క్రితం వరద నీటికి వంతెన సగభాగం కొట్టుకుపోయిందని, ఇప్పుడు అదే స్థాయిలో వరద నీరు పోటెత్తిందని స్థానికులు తెలిపారు.

ధారకొండ రహదారిలో రాకపోకలకు తీవ్ర అంతరాయం

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు నుంచి ధారకొండ వెళ్లే ప్రధాన రహదారిలో 12 చోట్ల భారీ వృక్షాలు విరిగిపడడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కొన్ని చోట్ల బండరాళ్లు, ఇసుక, బురద కొట్టుకు వచ్చి రహదారిపై నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. సీలేరు- భద్రాచలం, సీలేరు- రాజమహేంద్రవరం ప్రధాన రహదారిలో వలసగెడ్డ వంతెనకు గండి పడింది. దీంతో ఇరువైపులా రాకపోకలు నిలిచిపోయాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు విరిగిపడిపోయిన చెట్లు, రోడ్డుపై అడ్డంగా ఉన్న రాళ్లు, బురదను ఎక్స్‌కవేటర్ సహాయంతో అధికారులు తొలగిస్తున్నారు.

అరకులోయలో..

అరకులోయ: మండలంలో వర్షాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచి జల్లులతో కూడిన వర్షం పడుతోంది. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులు ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షం వల్ల జనజీవనానికి అంతరాయం ఏర్పడింది.

పెదబయలులో..

పెదబయలు: స్థానిక మత్స్యగెడ్డ పాయ నిండుకుండలా దర్శనమిస్తోంది. భారీ వర్షాలకు పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోమంగి పంచాయతీ మర్రిపుట్టు కాజ్‌వే పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలపై అధికారులు ఆంక్షలు విధించారు.

పాడేరు ఘాట్‌లో..

పాడేరు రూరల్: పాడేరు ఘాట్ మార్గంలోని 12వ మైళ్లు గ్రామ సమీపంలో సోమవారం మధ్యాహ్నం ఓ భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. దీంతో సుమారు రెండు గంటల సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు ఆ వృక్షాన్ని పక్కకు తొలగించడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి. ఇరడాపల్లి పంచాయతీ బొక్కెళ్ల వద్ద మత్స్యగెడ్డ, జి.ముంచంగిపుట్టు పంచాయతీ పర్తానిపుట్టు వద్ద కాజ్‌వేపై మత్స్యగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి మినీ రిజర్వాయర్ వర్షంతో ముదుములు కోతకు గురయ్యాయి. వర్షాలతో రిజర్వాయర్‌లో సామర్థ్యానికి నీరు చేరడంతో ప్రమాద స్థాయికి నిల్వలు చేరాయి. ముదుములు కోతకు గురవ్వడంతో పంట పొలాలు నీట మునిగాయి. టీడీపీ హయాంలో నిర్మించిన మినీ రిజర్వాయర్ నిర్వహణను వదిలేయడంతో పంట పొలాలకు నష్టం వాటిల్లుతున్నదని గిరిజన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు సర్పంచ్ కొములు సమాచారం అందించారు.

వాగులో చిక్కుకున్న కూలీలను కాపాడిన పిల్లిగెడ్డ గ్రామస్థులు

సీలేరు: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులోని పిల్లిగెడ్డ వాగులో ఐదుగురు గిరిజన కూలీలు చిక్కుకుపోయారు. వీరిని పిల్లిగెడ్డ గ్రామస్థులు కాపాడి వాగు దాటించి సీలేరు తీసుకొచ్చారు. జీకేవీధి మండలం సీలేరు సమీపంలోని ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గల పిల్లిగెడ్డ వాగుపై పాత వంతెన శిథిలమైపోవడంతో కొత్త వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులు చేసేందుకు వచ్చిన ఐదుగురు గిరిజన కూలీలు వాగు పక్కనే మకాం ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆదివారం రాత్రి ఇక్కడ కురిసిన కుండపోత వర్షానికి ఆ గిరిజన కూలీలు వాగులో చిక్కుకుపోయారు. ఈ విషయాన్ని సోమవారం ఉదయం పిల్లిగెడ్డ గ్రామస్థులు గమనించి వారిని సురక్షితంగా వాగు దాటించి సీలేరు తరలించారు.

గర్భిణిని తాడు సాయంతో వాగు దాటించి ఆస్పత్రికి తరలింపు

గూడెంకొత్తవీధి: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని స్థానికులు తాడు సహాయంతో జర్రెల వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. మొండిగెడ్డ పంచాయతీ తోటగొంది గ్రామానికి చెందిన సాగిన శాంతికి సోమవారం పురిటినొప్పులు వచ్చాయి. దీంతో స్థానికులు జీపులో జర్రెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే జర్రెల వద్ద వాగు ఉధృతంగా ప్రవహించడంతో జీపు వెళ్లే పరిస్థితి లేకపోయింది. దీంతో వాగుకు ఇరువైపులా తాడుకట్టి గిరిజనులు ఒకరినొకరు సహాయం చేసుకుంటూ గర్భిణిని వాగు దాటించారు. అక్కడ నుంచి అంబులెన్స్‌లో జర్రెల పీహెచ్‌సీకి తరలించారు. ఆమె ఆస్పత్రిలో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుతో ఏం సాధించారు..

టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు శ్రావణ్

పాడేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేసి వైసీపీ అధినేత జగన్ ఏమి సాధించారని పార్టీ అరకులోయ పార్లమెంట్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ప్రశ్నించారు. తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల జగన్ పాలనో విధ్వంసాలు, అక్రమ అరెస్టులు మినహా ప్రజలకు ఎటువంటి మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజల కోసం పరితపించే విజన్ ఉన్న నేత చంద్రబాబును స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అక్రమంగా అరెస్టు


విలేకరులతో మాట్లాడుతున్న కిడారి శ్రావణ్‌కుమార్

చేయడం ద్వారా ప్రజల్లో జగన్ మరింత పలుచన అయ్యారన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వ పాలన అధ్వానంగా ఉండడంతో ప్రజలు సైతం తాజా ఎన్నికల్లో ఛీకొట్టిన సంగతి వైసీపీ నేతలు, క్యాడర్ మర్చిపోకూడదని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బి.వెంకటరమణరాజు, పాండురంగస్వామి, ఎస్.ప్రసాద్, ఆర్.త్రినాథ్, కె.లైకోన్, మురళీ రామారావు, సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

హుకుంపేట: తూఫాన్ ప్రభవంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి శ్రావణ్ సూచించారు. తడిగిరి పంచాయతీలో సోమవారం పర్యటించి ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నేతలు వసంత కుమారి, కె.రమ, రంజిత్, రమణ, ఎస్.సుబ్బారావు శశిభూషణం, సూర్యకాంతం, ఎస్.సత్యవతి, నాగభూషణం, పాల్గొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేయండి

▸▸ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన జేసీ

పాడేరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు ఓటరు జాబితాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా తయారీపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సంపూర్ణంగా సహకరించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టినపుడు 1,685 మంది అందుబాటులో లేరని, 390 మంది ఇతర ప్రాంతాలకు తరలివెళ్లారని, 1,387 మంది మృతి చెందారని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే 577 మంది ఓటర్లకు ఫోటోలు సక్రమంగా లేవని, వాటిని సవరిస్తామని చెప్పారు. డూప్లికేట్, మృతి చెందిన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తామన్నారు. ఓటరు నమోదుపై బూత్ స్థాయి అధికారులకు శిక్షణ అందిస్తామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారిణి బి.పద్మావతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

తాజంగి జలాశయానికి వెళ్లొద్దు: సబ్ కలెక్టర్

చింతపల్లి, సెప్టెంబరు 9: తాజంగి జలాశయం వద్దకు ప్రజలు వెళ్లరాదని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ తెలిపారు. మండలంలోని తాజంగి జలాశయం, దిగువనున్న పంట పొలాలు, బలభద్రం వంతెనను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులనాయన మాట్లాడుతూ తాజంగి జలాశయంలో నీటి ఉధృతి అధికంగా ఉందన్నారు. గిరిజనులు జలాశయంలో చేపలు వేటకు వెళ్లరాదన్నారు. అలాగే వినాయక విగ్రహాల నిమజ్జనాలకు కూడా వెళ్లవద్దని సూచించారు.

పంట నష్టాలను గుర్తించాలి

హుకుంపేట: తూఫాన్ ప్రభావంతో జరిగిన పంట నష్టాలను రెవెన్యూ అధికారులు గుర్తించాలని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ఆదేశించారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి ఆయన పర్యటించి పంట పొలాలు, దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. హుకుంపేట, చీడిపుట్టు మధ్యలో వంతెనపైన వరద నీరు ఉధృతంగా ప్రవహించి ప్రవహించడంతో రాకపోకలను నిలిపివేయాలని రెవెన్యూ సిబ్బందికి ఆదేశించారు. అలాగే అక్కడ రాత్రి గస్తీ నిర్వహించాలని సూచించారు. మండలంలోని ప్రతీ గ్రామాన్ని సందర్శించి పంట నష్టాలను అంచనా వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ మోహనరావు, వీఆర్వో కొండబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఏవో కార్యాలయం మూసివేతపై టీడీపీ నేతల నిరసన


తెరచుకోని ఏవో కార్యాలయం వద్ద నాయకుల నిరసన

అనంతగిరి, సెప్టెంబరు 9: మండల కేంద్రంలో వ్యవసాయ కార్యాలయం సోమవారం తెరచుకోకపోవడంపై టీడీపీ నాయకులు మండిపడ్డారు. తుఫాన్‌తో పంట పొలాలు నీట ముగిగాయని, పంట వివరించేందుకు కార్యాలయానికి వస్తే తెరచుకోలేదని, ఏవో ఉమామహేశ్వరి విధులు హాజరుకాకపోవడం దారుణమని టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు అసహనం వ్యక్తం చేశారు. ఏవోపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అలాగే తుఫాన్ కారణంగా నష్టంపై సత్వరమే నివేదికను జిల్లా కలెక్టర్ సమర్పించాలని ఎంపీడీవో నగేష్‌ను కలిసి కోరారు. నాయకులు టి.ఆనందరావు, ఎం.జోగులు, పి.జగన్‌బాబు, శంకరరావు, ఎమ్.రంజిత్ పాల్గొన్నారు.

అంతులేని విషాదం

... 5వ పేజీ తరువాయి

అధికంగా ఉన్నది. ఆదివాసీలు అధికంగా పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పాడేరు డివిజన్ పరిధిలోని 80 శాతం గ్రామాలు కొండల దిగువన ఉన్నాయి. ఆదివాసీల్లో అతి తక్కువ మందికి పక్కా గృహాలు ఉన్నాయి. మెజారిటీ ఆదివాసీలు పెంకులు, రేకులతో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. వర్షాలు కురిస్తే కొండల నుంచి వర్షపు నీరు గ్రామాలకు వస్తూ ఉంటుంది. అయితే వర్షపు నీటితో పాటు కొండచరియలు విరుచుపడితే నష్టం అధికంగా ఉంటుంది. చట్రాపల్లి తరహా గిరిజన గ్రామాలు జీకేవీధి మండలంలో అధికంగా ఉన్నాయి. ప్రధానంగా ధారకొండ, అమ్మవారి ధారకొండ, గాలికొండ, వంచుల, జర్రెల, మొండిగెడ్డ పంచాయతీల్లో ఉన్నాయి. చింతపల్లి, జి.మాడుగుల, పాడేరు, ముంచంగిపుట్టు, పెదబయలు, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి, కొయ్యూరు మండలాల్లోనూ అధికంగా ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఆదివాసీలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం సాగించాల్సి వస్తున్నది. ఓ వైపు అడవుల నుంచి నీరు గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. అలాగే కొండ వాగులు ఉధృతంగా ప్రవహించడం వల్ల ఆదివాసీలకు బాహ్య సంబంధాలు తెగిపోతున్నాయి. వర్షాల ఉధృతికి వాగులు దాటే సమయంలో పలువురు ఆదివాసీలు మృత్యువాత పడుతున్నారు. రోగులు, గర్భిణులను సైతం డోలీపై వాగులను దాటించి ఆస్పత్రికి తీసుకొని వెళ్లాల్సి వస్తున్నది.

హుద్‌హుద్‌లోనూ..

2014లో అక్టోబరు 8న హుద్‌హుద్ తుఫాను సమయంలో మాదల పంచాయతీ మేదరశాల గ్రామంపై కోడుపుంజు వలస తరహాలో కొండచరియలు విరిగి పడ్డాయి. ఆరుగురు గిరిజనులు మృత్యువాత పడ్డారు. ఆదివాసీలు పశుసంపదను కూడా నష్టపోవాల్సి వచ్చింది. చట్రాపల్లి గ్రామంలోనూ కొండచరియల వల్ల పలుగురు గిరిజనులు గాయపడ్డారు. సుమారు 70 మేకలు, గొర్రెలు, 30 కోళ్లు, ఆరు పశువులు మృతి చెందాయి. ఆరు గృహాలు పూర్తిగా ధ్వంసం కాగా, 21 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

పంట పొలాలకు సమీపంలోనే ఇళ్లు

ఆదివాసీలు అత్యధిక సంఖ్యలో పంట పొలాలకు సమీపంలోనే గృహాలు నిర్మించుకుంటారు. పంట పొలాలు కొండలకు దిగువన ఉంటాయి. దీంతో భారీ వర్షాలు కురిసిన సమయంలో కొండల నుంచి బురదతో కూడిన వరద, కొండచరియలు గ్రామాలకు కొట్టుకుని వస్తున్నాయి. చట్రాపల్లి గ్రామం కొండకు దిగువన ఉండడం వల్లే ఈ ఘటన జరిగింది. కొండలకు దిగువన గృహాలు నిర్మించుకోవడం ప్రమాదమని తెలిసినప్పటికీ ఆదివాసీలు దేవుడిపై భారం వేసి నివాసముంటున్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివాసముంటున్న ఆదివాసీలు ఇతర ప్రాంతాలకు తరలించేందుకు అప్పట్లో అధికారులు చర్యలు తీసుకున్నప్పటికి పంట పొలాలకు దూరంగా ఉండేందుకు సుముఖత చూపించలేదు. దీంతో ఇప్పటికీ చట్రాపల్లి తరహా గ్రామాల్లో ఆదివాసీలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

జలాశయాలకు పోటెత్తిన వరద నీరు

... 5వ పేజీ తరువాయి

గేట్లు ఎత్తి లక్షా 10 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే గుంటవాడ జలాశయానికి పిల్లిగెడ్డ వాగు నుంచి 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో ఐదు గేట్లు ఎత్తి దిగువకు 23 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గుంటవాడ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 1,360 అడుగులు కాగా, ఇక్కడ 1,359 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పూర్తి స్థాయికి చేరువలో బలిమెల జలాశయం

సీలేరు కాంప్లెక్సులో అత్యంత పెద్దదైన బలిమెల జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉంది. ఇక్కడ పూర్తిస్థాయి నీటిమట్టం 1,516 అడుగులు కాగా, ప్రస్తుతం 1,510 అడుగులకు చేరింది. ఇక్కడ మరో ఐదు అడుగుల నీటిమట్టం పెరిగితే బలిమెల జలాశయం నుంచి గుంటవాడ జలాశయానికి నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. బలిమెల నుంచి నీటిని విడుదల చేస్తే గుంటవాడ జలాశయానికి మరింత ఇన్‌ఫ్లో వచ్చి చేరే అవకాశం ఉండడంతో జెన్‌కో అధికారులు గుంటవాడ జలాశయం నుంచి భారీగా నీటిమట్టం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు.

జల విద్యుత్ కేంద్రంలోకి వర్షపు నీరు

ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షానికి జల విద్యుత్ కేంద్రం కొండ పైనుంచి వర్షపు నీరు కేబుల్ ట్రెంచ్‌ల ద్వారా టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవహించింది. జల విద్యుత్ కేంద్రం వెనుక భాగంలో ఉన్న డీ వాటరింగ్ పంప్ షెడ్ కూడా నీట మునిగిపోయి, డీ వాటరింగ్ సమస్య తలెత్తింది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమై టర్బైన్ ఫ్లోర్‌లోకి ప్రవేశించిన వర్షపు నీటిని అదనపు మోటార్లను అమర్చి జల విద్యుత్ కేంద్రానికి నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టారు. కాగా ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం తొమ్మిది గంటల వరకు జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. ఉదయం తొమ్మిది గంటల తరువాత రెండు యూనిట్లను వినియోగంలోకి తీసుకొచ్చారు.

మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పాదన నిలిపివేత

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోకి సోమవారం వరదనీరు ప్రవేశించింది. దీంతో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదనను నిలిపివేశారు. జోలాపుట్టు, డుడుమ జలాశయాల నుంచి భారీ స్థాయిలో నీటిని విడుదల చేయడంతో విద్యుత్ ఉత్పాదనకు వినియోగించే రెండో నంబరు జనరేటర్‌ను వరదనీరు ఒక్కసారిగా ప్రాజెక్టులో గల విద్యుత్ టర్బన్ ఫ్లోర్‌లోకి నీరు ప్రవేశించింది. ఉదయం నుంచి నీటి ప్రవాహం అడ్డుకట్ట వేయడానికి ఉద్యోగులు, కార్మికులు శ్రమించినా ఫలితం లేకపోయింది. దీంతో ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదనను పూర్తి స్థాయిలో నిలిపివేశారు. ప్రస్తుతం బ్యాక్ ఫీడింగ్ ద్వారా మాచ్‌ఖండ్, డుడుమ, జోలాపుట్టు జలాశయాల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో..

ముంచంగిపుట్టు: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే జోలాపుట్టు, డుడుమ జలాశయాలకు వరదనీరు పోటెత్తింది. సోమవారం ఆ రెండు జలాశయాలకు ఇన్‌ఫ్లో భారీగా చేరుతుండడతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జోలాపుట్టు జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2,750 అడుగులు కాగా, సోమవారం 2,549.20 అడుగులకు చేరింది. దీంతో ఆరు గేట్లు ఎత్తి దిగువకు 50 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డుడుమ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 2,590 అడుగులు కాగా, ప్రస్తుతం 2,589.40 అడుగులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమై నాలుగు గేట్లు ఎత్తి 40 వేల క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతంలో గల బలిమెలకు విడుదల చేశారు. ఆ రెండు జలాశయాల చరిత్రలో ఇంత స్థాయిలో వరద నీరు రావడం, అదే స్థాయిలో నీటిని విడుదల చేయడం ఇదే మొదటిసారని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సంక్షిప్తంగా..

గ్రామ సచివాలయాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు

పాడేరు రూరల్, సెప్టెంబరు 9: మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో పురావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో కె.సాయి నవీన్ తెలిపారు. తుఫాన్ కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలిగినా సచివాలయాలకు తరలించేందుకు సర్పంచులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ప్రతీ సచివాలయంలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి డిజిటల్ అసిస్టెంట్‌ను ఇన్‌చార్జిగా నియమించామన్నారు. ఐనాడ సచివాలయానికి కె.లోకేశ్‌కుమార్ ఫోన్ నెంబరు (9381641531), చింతలవీధికి బి.మహిసమ్మ (8985058052), దేవాపురం కె.జాన్‌బాబు (9492236970), డోకులూరు ఎస్.రమేష్ బాబు (9491264674), గొండెలి పి.నాగరాజు (9493056547), గుత్తులపుట్టు ఎల్‌టీ.రామునాయుడు (7382376768), ఇరడాపల్లి బి.సతీష్‌కుమార్ (9392127298), లగిశపల్లి ఎల్.ఉమామహేశ్వరరావునాయుడు (9490047707), మినుములూరు బి.సూర్యనారాయణ (9493424702), పాడేరు-1 బి.మనోహర రాజు (8985883891), పాడేరు-2 కె.జానకమ్మ (8985309491), పాడేరు-3 జి.సదానందం (9440859364), సలుగు టీజీ.సాయిప్రకాష్ (9490689544), తుంపాడ బి.కోటిబాబు (9492348023), వంతాడపల్లి వీజేవీ.కిరణ్ (6303507137), వంట్లమామిడి డిజిటల్ అసిస్టెంట్ బి.మాధవిలత (8331851898)ను ఎల్లవేళలా సంప్రదించి పునరావాస కేంద్రంలో ఆయా ప్రాంతాల ప్రజలు సహాయక చర్యలు పొందవచ్చని ఆయన వివరించారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 9: వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఆశ్రమ పాఠశాల వసతి గృహాలు, కళాశాలల వార్డెన్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ విధిగా అమలు చేయాలని, పిల్లలకు ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యంపై వార్డెన్లు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా వైద్యులకు చూపించి సకాలంలో వైద్య సేవలు అందేలా చూడాలని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు మంచి నడవడికను నేర్పాలని, సమాజంలో జరుగుతున్న మంచిచెడులను వివరించాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, ఐసీడీఎస్ పీడీ కె.సూర్యకుమారి, ఏటీడబ్ల్యూవో స్వర్ణలత, ఎంఈవో క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గెడ్డలు దాటే ప్రయత్నం చేయొద్దు

అరకులోయ, సెప్టెంబరు 9: సిరగాం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రమాదకరంగా గెడ్డలు ప్రవహిస్తున్నాయని, వాటిని ప్రజలు దాటే ప్రయత్నం చేయకూడదని తహసీల్దార్ వేణుగోపాల్, సీఐ హిమగిరి సూచించారు. తోటవలస, కోడిపుంజువలస గ్రామాల మధ్య పెద్దగడ్డ ప్రమాదకరంగా ప్రవహిస్తున్న విషయం తెలుసుకుని వారు సోమవారం వెళ్లి పరిశీలించారు. తోకవలస గ్రామస్థులు అరకులోయ, కోడిపుంజువలసకు వెళ్లాలంటే పెద్దగడ్డ దాటాల్సి ఉందని, ఇది ప్రమాదకరంగా ప్రవహిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్, సీఐ సూచించారు. ఈ ప్రాంతంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశామని, పెద్దగెడ్డ నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టి సాధారణ పరిస్థితికి వచ్చాక గెడ్డలు దాటాలని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

బాధితులకు సాయం అందేలా చూస్తాం

అరకులోయ, సెప్టెంబరు 9: భారీ వర్షాల కారణంగా గంజాయిగుడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని పెదలబుడు సర్పంచ్ పి.దాసుబాబు చెప్పారు. ఈ గ్రామంలో కొర్రా నాగేశ్వరరావు, కొర్రా సీతమ్మల ఇళ్ల మట్టిగోడలు నానిపోయి కూలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ దాసుబాబు వార్డు సభ్యులతో సోమవారం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. నేలమట్టమైన ఇళ్లను పరిశీలించి బాధితులకు ఆర్థిక సాయం అందించారు. అలాగే ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీలోని 21 గ్రామాలను సందర్శించి తుఫాన్ నష్టంపై కలక్టర్‌కు నివేదిక అందిస్తామని సర్పంచ్ చెప్పారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

అనంతగిరి, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఆదివారం రాత్రి 2 హెచ్‌టీ అండర్ గ్రౌండ్ కేబుల్ కాలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. సోమవారం ఉదయం సబ్ స్టేషన్ వద్దకు ఏఈ రామలింగేశ్వరరావు చేరుకుని యుద్ధ ప్రతిపాదికన పునరుద్ధరణ పనులు చేపట్టారు. వినియోగదారులకు ఇబ్బందులు పడకుండా మధ్యాహ్నం నుంచి యథావిధిగా విద్యుత్ సరఫరా జరిగేలా చూశారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చునని ఈ సందర్భంగా ఏఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐ రవికాంత్, లైన్‌మాన్లు సురేష్, భగవాన్, సత్యనారయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందించాలని వినతి

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 9: వేతన బకాయిలను తక్షణమే అందించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ మాతృ బహు భాషా ఉపాధ్యాయులు ఎంఈవో క్రిష్ణమూర్తికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు వి.చంద్రయ్య, కె.కొండయ్య, పి.వెంకటరమణ మాట్లాడుతూ మాతృ భాషలో విద్యా బోధన చేస్తూ ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు పునాదులు వేస్తున్న మాతృ బహు భాషా ఉపాధ్యాయులపై పాలక ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం తగదని వాపోయారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అందించాలని, ఫిబ్రవరి, జులై, ఆగస్టు నెలలకు సంబంధించి బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కె.ప్రకాశ్‌రావు, జి.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె తాత్కాలిక వాయిదా

పాడేరు రూరల్, సెప్టెంబరు 9: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుందరరావు, ఏఐటీయూసీ జిల్లా కో-కన్వీనర్ అమర్ తెలిపారు. ఇటీవల కాంట్రాక్టు ఉద్యోగులకు బకాయిపడ్డ ఆరు నెలల వేతనాలతో పాటు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెల వేతనాన్ని బ్యాంక్ అకౌంట్‌లో జమచేసి, మిగిలిన ఐదు నెలల బకాయి వేతనాలను త్వరలోనే చెల్లిస్తామని హామీ రావడంతో వాయిదా వేసినట్టు చెప్పారు.